# బడి పిల్లల పాటలు





బహూకరణ











ఎం.వి.జి.ఆంజనేయులు
ప్రిన్సిపాల్
జిల్లావిద్యాశిక్షణ సంస్థ (D.I.E.T.)
అంగలూరు,కృష్ణాజిల్లా
Cell:9949993706,9441257931



## అద్భుతం-అభినందనీయం

పాటల ద్వారా పాఠాలు చెప్పవచ్చని, అభ్యసనాన్ని ఆనందకరం చేయవచ్చని కృష్ణాజిల్లా అంగలూరు డైట్ ప్రిన్సిపాల్ **ఎం.వి.జి.ఆంజనేయులు** గారు చేసిన ప్రయత్నం బాగుంది. తెలుగు,ఇంగ్లీషే కాకుండా లెక్కలు, సైన్సు,సోషల్ స్టడీస్ సబ్జక్టులు కూడా 'పాటలతో బోధించవచ్చు' అనే ఆలోచన **అద్భుతం**.అలాంటి పాటల్ని సి.డి. చేసి ఉపాధ్యాయలోకానికి **ఉచితముగా** అందిస్తున్న ఆంజనేయులుగారు **అభినందనీయులు**. పాఠశాలల్లో ఈ పాటలు ఉపయోగించుకుని, విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించాలని ఉపాధ్యాయుల్ని కోరుతూ......

మీ

మచిలీపట్నం
2.8.2011

**కె.పార్థసారధి**
**ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర మాధ్యమికవిద్యాశాఖామాత్యులు**

## 1. చదువులమ్మకు వందనాలు

చదువులమ్మకొందనాలో - ఎన్నెలా!
సరస్వతికొందనాలో - ఎన్నెలా!!

బాలకార్మికులంతా - ఎన్నెలో, ఎన్నెలా!
బళ్ళోకి రావాలి - ఎన్నెలో, ఎన్నెలా!!
బళ్ళోనూ జేరాక - ఎన్నెలా
వారి బ్రతుకు మారిపోతుంది - ఎన్నెలో! ఎన్నెలా!! ॥చదువలమ్మ॥

బడిఈడు పిల్లల్ని - ఎన్నెలో, ఎన్నెలా
పనిలోన పెట్టుకుంటె -ఎన్నెలో, ఎన్నెలా
జరిమాన వేస్తారు - ఎన్నెలా
జైలు శిక్ష వేస్తారు - ఎన్నెలో, ఎన్నెలా ॥చదువలమ్మ॥।

విద్య నేర్చుకుంటేను - ఎన్నెలో, ఎన్నెలా
వివేకమే పెరుగుతుంది -ఎన్నెలో, ఎన్నెలా
విద్యలేనివారంతా - ఎన్నెలా
వివేక శూన్యులే - ఎన్నెలో, ఎన్నెలా ॥చదువలమ్మ॥

ఇల్లాలు చదువుకుంటే - ఎన్నెలో, ఎన్నెలా
ఇంటికే వెలుగంట - ఎన్నెలో, ఎన్నెలా
ఇల్లాలికి చదువుంటే - ఎన్నెలా
ఇల్లంతా బాగుపడును -ఎన్నెలో, ఎన్నెలా ॥చదువలమ్మ॥

## 2. చక్కటి మా తెలుగు భాష

చక్కటి మా తెలుగు భాష
చెక్కెరలను చిందు భాష
భలే భలే తెలుగు భాషా
బంగారం లాంటి భాషా ॥చక్కటి॥

ముత్యాలను గ్రుచ్చినట్లు
ముచ్చటైన తెలుగు భాష
వీణ తీగ మీటినట్లూ.........
వినిపించే తెలుగు భాషా
బంగారంలాంటి భాషా ॥చక్కటి॥

అమ్మా అని పిలుచు భాష
తమ్ముడు పలికే భాష
చెల్లెలి అల్లరి భాష........
పిల్లల చక్కని భాషా
బంగారంలాంటి భాషా ॥చక్కటి॥

తేనెలొలుకు తెలుగు భాష
దేశభాషలందు లెస్స
మాట్లాడే స్థానంలో......
రెండోది తెలుగు భాషా
బంగారంలాంటి భాషా ॥చక్కటి॥

## 3. అంకెల లింకులు

బాలల్లు పాపల్లు రారే
పాడంగ మీరంత రారే
అంకెల్ని లెక్కింప రారే
అవి ఏవో గుర్తింప రారే ॥బాలల్లు॥

కలడొక్క దేవుండు మనకు
కనరెండు కనులుండు మనకు
ఘనమైన లోకాలు మూడూ
అనువైన వేదాలునాల్గూ ॥బాలల్లు॥

మన చేతి వేళ్ళన్న ఐదు
తినబోవ రుచులన్ని ఆరూ
వారానికి రోజు లేదూ
దిక్కులు మూలలూ ఎనిమిది ॥బాలల్లు॥

గ్రహరాశిలో తొమ్మిదుండు
చేతుల్లో పదివేళ్ళు ఉండు
జోడించి లెక్కింపరండీ
దేవునకు జేజేలనండి ॥బాలల్లు॥

## 4. గురువుకు వందనం

**సాకీ:** చీకటిని చిదిమేటి ఓ రవికిరణమా!
అజ్ఞానము పారద్రోలు ఆశాదీపమా!
సమసమాజమును స్థాపించు అనన్య శౌర్యమా!
గురువర్యా ! నీకిదే వందనమయ్యా!!

పల్లవి: వందనము వందనమండీ!
మా గురువులకు వందనమండీ!!
భరతమాత పసిపాపల భవితచూపె భగీరధుడు
భరతకీర్తినెగురవేయ భవితనంత బాగుసేయ ॥వందనము॥

భరతజాతి భవిష్యత్తుకు మూలస్తంభముగ నిలచి
విద్యార్థుల మనసులలో హిమశిఖరంగ వెలిగే
కనిపించని భగవంతుని ప్రతిరూపంగా నిలచి...ఆ...ఆ...2
పసిపాపల మనసులలో నిలిచి పోవు ఒజ్జలకు ॥వందనము॥

త్యాగనిరతికే మీరు మారుపేరుగా మారి
అంకిత భావానికే ఆలంబనగా నిలచి
జగతికి వెలుగులు నింపే కరగిపోవు దీపమోలె ..ఆ...ఆ..2
అలుపెరుగక కృషి చేసే ఉపాధ్యాయుడా నీకు ॥వందనము॥

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లివి తండ్రివి నీవే
జ్ఞాన దీప్తి వెలిగించే జ్ఞాన జ్యోతివి నీవే
పాఠశాల ప్రాంగణంలో ప్రకాశించె ప్రమిదవోలె ..ఆ...ఆ...2
నీవు సాగిరావాలి నిరంతరం తరంతరం ॥వందనము॥

## 5. గొప్ప టీచరు

ఏ అమ్మ కన్న బిడ్డడు ఈ టీచరూ....ఈ టీచరూ....2
మా బాధలు విన్నాడు మాలో ఒకడైనాడు -2
ఏ అమ్మ కన్న బిడ్డడు ఈ టీచరూ....ఈ టీచరూ...

పారిపోయేటోళ్ళతో పలకలు పట్టించాడు
ఆటపాటలతోటి మాటలు నేర్పించాడు -2
అమ్మ, అన్నంలోన 'అ' ఉందని చెప్పాడు
అలుపన్నది ఎరగకుండా పొత్తం చదివించాడు ॥ఏ అమ్మ॥

చదువుకున్నోళ్ళెవ్వరు మావంక చూడరని
ఎర్రిబాగోళ్ళమనీ చిన్నచూపు చూస్తారని -2
అనుకునేటోళ్ళము ఈబాబు రాకముందు
అచ్చరాలు నేర్పి బ్రతుకు తిప్పినాడు మలుపు ॥ఏ అమ్మ॥

## 6. ఇంగ్లీషు ఈజీ

ABCDEF - GHIJKL
MNOP - QRST
UVW - XYZ
ఇరవై ఆరు ఇంగ్లీష్ అక్షరాలూ

CAT క్యాట్ - క్యాట్ అంటే పిల్లి
RAT ర్యాట్ - ర్యాట్ అంటే ఎలుక
ఇంగీషు మాటల అర్థాలివేగా -2

TIGER టైగర్ - టైగర్ అంటే పులి
GOAT గోట్ - గోట్ అంటే మేక
పులి మేక ఆటలు ఆడుదమా -2

BOY బోయ్ - బోయ్ అంటే బాలుడు
GIRL గళ్ - గళ్ అంటే బాలిక
బాలబాలికల వందనాలివేగా - 2

ABCDEFGHIJKLMNOPQRSTUVWXYZ

## 7. నెలలు - ఋతువులు

**సాకీ:** తెలుగునెలలు తెలుసుకొనీ
ఋతుధర్మాలు తెలుసుకొనీ
తేటతెల్లముగ ఉందాము
తెలుగు భాషలో జీవిద్దాము

పల్లవి :
చైత్ర వైశాఖ మాసములం - వసంత ఋతువులో వస్తాము
ప్రకృతి శోభను తెస్తాము - పళ్ళూపూలూ ఇస్తాము

జ్యేష్ఠ ఆషాఢ మాసములం - గ్రీష్మ ఋతువులో వస్తాము
ఎండలు మెండుగ తెస్తాము - మామిడిపళ్ళను ఇస్తాము

శ్రావణ భాద్రపద మాసములం - వర్ష ఋతువులో వస్తాము
వానలు బాగా తెస్తాము - గొడుగులు మీకు ఇస్తాము

ఆశ్వయుజ కార్తీక మాసములం - శరదృతువులో వస్తాము
చల్లని వెన్నెల తెస్తాము - పూజా పుణ్యం ఇస్తాము

మార్గశిర పుష్యమాసములం - హేమంత ఋతువులో వస్తాము
చల్లని మంచును తెస్తాము - ధనధాన్యాలు ఇస్తాము

మాఘ ఫాల్గుణ మాసములం - శిశిరఋతువులో వస్తాము
చెట్ల ఆకులు రాల్చేస్తాం - పెళ్ళి భోజనాల్ తినిపిస్తాం.

## 8. చిన్నివిత్తనం

చిన్ని విత్తనమ్ము - మన్ను కిందనూ
కన్నులూ మూసి - నిద్రపోయెనూ

వాన బొట్టులన్ని - దానిమీదనూ
జారి- జారి-- జారి జారి పడెనూ

చల్లగాలి చక్కగా విత్తనానికీ
మెల్ల మెల్ల మెల్లగా వీయసాగెనూ

చాల కాలమాయె - బాల సూర్యుడూ
పిలువ వచ్చే లెమ్ము! లే!! లెమ్మనీ!!! ॥చిన్ని॥

అప్పుడా గింజా - ఆవలించుచూ
దుమికి లేచి వచ్చెన్ - సంతసమ్మునా

చిన్న విత్తనమ్ము - మన్ను క్రిందనుండి
కళ్ళూ తెరచి - నిద్ర లేచిచూచెనూ ॥చిన్ని॥

## 9. గురువు గారి గుండె చప్పుడు

గురువు గారి గుండె చప్పుడు - విద్యార్ధుల పలుకైనపుడు
పాఠం ఒక ఆటవుతుంది - ప్రతిపలుకు పాటవుతుంది

పంతులోరి ప్రేమను చూస్తే - అమ్మా నాన్నా అనిపించాలి
బడిలోపల అడుగిడగానే - కేరింతలు వినిపించాలి -2

వెన్నెల్లో గోరుముద్దలు - తాత చెప్పే సరదా కథలు
బడిగంటై వినిపించాలి - వడివడిగా నడిపించాలి -2

గోళీలు, బొంగరాలు - బడిలోనే అగుపించాలి
టీచరమ్మ ముద్దుమాటలు - మిఠాయిలను మరిపించాలి -2

బడి అంటే జైలు కాదని - చల్లనైన అమ్మ ఒడియని
పిల్లలంతా భావించాలి - పసిలోకం వికసించాలి -2

గురువు గారి గుండె చప్పుడు - విద్యార్ధుల పలుకైనపుడు
పాఠం ఒక ఆటవుతుంది - ప్రతిపలుకు పాటవుతుంది
పాఠం ఒక ఆటవుతుంది - ప్రతిపలుకు పాటవుతుంది

## 10. మనమంతా ఒక్కటే

భారతదేశం మనదేరా
భారతీయులం మనమేరా
**కోరస్:** అహ........యహ........ఒహో......అహయహ
అహ........యహ........ఒహో......అహయహ

కులాలు మతాలు వేరైనా
రంగు భాషా వేరైనా
కుటుంబమొకటే కదరా! మన కుటుంబమొకటే కదరా! ॥భారతదేశం॥

చెట్టుకు కొమ్మలు వేరైనా
కొమ్మకు రెమ్మలు వేరైనా
కాండమొక్కటేగదరా!- ఆ కాండమొక్కటే గదరా! ॥భారతదేశం॥

పువ్వుల రంగులు వేరైనా
గుళ్ళో దేవుళ్ళెందరు ఉన్నా
పూజ ఒక్కటేకదరా! - ఆపూజ ఒక్కటే కదరా! ॥భారతదేశం॥

## 11. లెక్కల సూత్రాలు

ఓం....శ్రీనివాస రామానుజన్ నమః
ఓం....శకుంతలా దేవి నమః

ఏ ప్లస్ బి హోల్ స్క్వేర్ ఈజికొల్టూ
ఏ స్క్వేర్ ప్లస్ బీ స్క్వేర్ ప్లస్ టూ ఏబీ

ఏ మైనస్ బి హోల్ స్క్వేర్ ఈజికొల్టూ
ఏ స్క్వేర్ ప్లస్ బీ స్క్వేర్ మైనస్ టూ ఏబీ

నేనే వృత్తాన్ని
నా వైశాల్యం పై ఆర్ స్క్వేర్
నా చుట్టుకొలత టూపైఆర్

నేనే రెక్టాంగిల్
నా వైశాల్యం ఎల్‌బి
నా చుట్టుకొలత టూఎల్ ప్లస్ టూబీ
నేనే రెక్టాంగిల్.....నేనే రెక్టాంగిల్......

## 12. అక్షరకిరణాలు

అక్షరాలు అరుణోదయ కిరణాలు
అజ్ఞానపుటంధకార హరణాలు-2 ॥అక్షరాలు॥

అందరికీకావాలి అక్షర జ్ఞానం
అదే మనిషి అభివృద్ధికి సోపానం
విద్యన్నది మానవునికి మణిదీపం
అది లేకపోవుటన్నదే పెనుశాపం -2 ॥అక్షరాలు॥

ఆత్మీయులు రాసినట్టి ఉత్తరం
చదువుకునే పాటి విద్య అవసరం
అప్పుసప్పు పుచ్చుకొనేటప్పుడు
చదువుంటే మోసపోవు ఎప్పుడూ -2 ॥అక్షరాలు॥

చదువు నిన్ను వదలిపోని దోస్తిరా
అది ఎన్నటికి తరగిపోని ఆస్తిరా
విద్య నీకు వివేకాన్ని పెంచురా
పదుగురిలో విలువను కలిగించురా -2 ॥అక్షరాలు॥

## 13. ఖండాలు - సముద్రాలు

ఆసియా, ఆఫ్రికా,ఐరోపా
ఉత్తర దక్షిణ అమెరికాలు
ఆంటార్కిటిక్,ఆస్ట్రేలియాలు
మొత్తము ఏడు ఖండములు
పెద్దదేమో ఆసియా
చిన్నదేమో ఆస్ట్రేలియా
మనముండేఖండం ఆసియా

సముద్రములెన్నో ఉన్ననూ
మహాసముద్రములైదేగా
పసిఫిక్,అట్లాంటిక్,ఆర్కిటిక్
హిందూమహాసముద్రం, అంటార్కిటిక్
పెద్దదేమో పసిఫిక్, చిన్నది అంటార్కిటిక్

సప్తఖండములివేగా
పంచ సంద్రాలివేగా

## 14. మత సమైక్యత

ఏది హిందూ? ఏది ముస్లిం ? ఏది క్రైస్తవమూ ? -2
ఎల్ల మతముల సారమొకటే
హృదయమే మతమూ -2

కృష్ణుడో, క్రీస్తో, మహమ్మదో
గీతయో,బైబిల్,ఖొరానో -2
ప్రేమనే బోధించలేదా
ద్వేషమును నిరసించే కాదా -2 ॥ ఏది ॥

తూర్పు పడమర భేదమేలా
తోట్లకెల్ల వసంతుడొకడే
కరము లెవరెటు మోడ్చి పిలిచినా
ఖంగుమనే గుడిగంట ఒకటే -2

ఏది హిందూ? ఏది ముస్లిం ? ఏది క్రైస్తవమూ ? -2
ఎల్ల మతముల సారమొకటే
హృదయమే మతమూ
వందేమాతరం మనదే ఈ తరం -3

# 15. చేపలు - చుట్టాలు

నేను పల్లెటూరి కుర్రోణ్ని బాబు
నేను చేపలూ పడతానుబాబు
నేనుదోసేది తాటిదోనెబాబూ
నేను యేసేది ఇసురోలబాబూ

నాను పుట్టింది పూలపల్లిపుంత
నాను పెరిగింది పెదపూడిసంత
నా అయ్యపేరు ఇసుకదొంతుబాబు
నాఅమ్మపేరు బొచ్చెచేపబాబు

నా కొడుకు పేరు కొరమీనుబాబు
నాకూతురు పేరు రొయ్యపీసుబాబు
నా తమ్ముడు పేరు జల్లకొంకుబాబు
నా చెల్లి పేరు చేదుపరిగెబాబు

నా మామ పేరు మట్టగిడసబాబు
నా అత్త పేరు ఇంగిలాయిబాబు
నాపెళ్ళాంపేరు శీలావతిబాబు
నా పేరు బొమ్మిడాయి బాబు

నేను పల్లెటూరి కుర్రోణ్ని బాబూ
నేను చేపలూ పడతానుబాబు
నేను పల్లెటూరి కుర్రోణ్ని బాబూ
నేను చేపలూ పడతానుబాబు

# 16. తల్లీభారతి వందనం

**సాకీ :** తల్లీ! భారతీ వందనం.. నీ ఇల్లే మా నందనం
తల్లీభారతీ వందనం నీ ఇల్లే మా నందనం
మేమంతా నీ పిల్లలము - నీ చల్లని ఒడిలో మల్లెలమూ ॥తల్లీ॥

పల్లవి :
తల్లిదండ్రులను గురువులనూ - ఎళ్ళవేళలా కొలిచెదమమ్మా
చదువులు బాగా చదివెదమమ్మా - జాతి గౌరవంపెంచెదమమ్మా ॥తల్లీ॥

కులమత భేదం మరచెదము - కలతలు మాని మెలగెదము
మానవులంతా సమానులంటూ - మమతను సమతను పంచెదము ॥తల్లీ॥

తెలుగు జాతికి అభ్యుదయం - నవభారతికి నవోదయం
భావిపౌరులం మనం మనం - భారత జనులకు జయం జయం ॥తల్లీ॥

# 17. పెద్ద కుటుంబంలో కష్టాలు

పెద్ద కుటుంబంలో కష్టాలు ఎన్నో
చిన్న కుటుంబంలో సుఖాలు ఎన్నో
ఒకరిద్దరు పిల్లలయితె చాలు
సుఖమయ జీవితానికి మేలు

చిల్డ్రన్ నాకు అరడనుమంది
జీతం చాలకుంది - జీతం చాలకుంది
ఏమి చేసేది నేను
అయ్యారే మేరభయ్యా ॥చిల్డ్రన్॥

పేరుకేమొ పేమెంటు జాస్తి
నా వెనుక ఐశ్వర్యం నాస్తి
ఫస్టు తారీకొచ్చాక చూస్తే
కడకు నాకు మిగిలేది నాస్తే ॥చిల్డ్రన్॥

కేజి ముప్ఫై రూపాయల బియ్యం
కొనితేవాలంటేనే భయ్యం
రోజుకైదు కేజీల రైసూ
దానితోనె నాపని డైసూ ॥చిల్డ్రన్॥

పెద్దోడ్కి ఫ్యాషన్ల మోజు
చిన్నోడ్కి సినిమాల క్రేజు
నా వైఫ్‌కి నగలంటే ప్లీజు
దానితోనె నా లైఫ్ క్లోజు

చిల్డ్రన్ నాకు అరడనుమంది
జీతం చాలకుంది.... జీతం చాలకుంది.....

# 18. సొగసరి మొగుడు-గడసరి పెళ్ళాం

**మొగుడు:** ర్యాలి రావుపాడు రేలంగి సంతలోన
బొచ్చెపరిగ తెచ్చినానె ముక్కెయ్యవే! ముక్కెయ్యవే పిల్లా! ముక్కెయ్యవే !!

**పెళ్ళాం:** ఓరోరి నామగడా! ఒయ్యారి నామగడా!
ఎర్రిబాగుల నామగడా! ఏబ్రాసి నామగడా!
రెక్కలున్న సేపకి ముక్కలుంటయా? -2

**మొగుడు:** నరసాపురం పాలకొల్లు మారుటేరు సంతలోన
కోడిపెట్ట తెచ్చినానె గుడ్డెయ్యవే! గుడ్డెయ్యవే పిల్లా ! గుడ్డెయ్యవే!!

**పెళ్ళాం:** ఓరోరి నామగడా! ఒయ్యారి నామగడా!
ఎర్రిబాగుల నామగడా! ఏబ్రాసి నామగడా!
జుట్టున్న కోడికీ గుడ్డుంటదా?-2

**మొగుడు:** భీమవరం ఆకీడు ఈరవాసరం సంతలోన
గేదెపెయ్య తెచ్చినానె పాలయ్యవే! పాలెయ్యవేపిల్లా! పెరుగెయ్యవే!!

**పెళ్ళాం:** ఓరోరి నామగడా! ఒయ్యారి నామగడా!
ఎర్రిబాగుల నామగడా! ఏబ్రాసి నామగడా!
కొమ్ములున్న గేదెకూ పాలుంటాయా? కొమ్ములున్న గేదెకూ పెరుగుంటదా?
పాలుంటాయా?..... పెరుగుంటాదా... 2

# 19. కృష్ణాజిల్లా

**సాకీ :**
కృష్ణాజిల్లా --జిల్లా -- కృష్ణవేణి -- జిల్లా

**పల్లవి :**
కృష్ణాజిల్లా --జిల్లా -- కృష్ణవేణి -- జిల్లా
కృషీవలుల జిల్లా -- జిల్లా
అక్షరాస్య జిల్లా -- జిల్లా
జిల్లల్ల జిల్లగాదో -- జిల్లా
కృష్ణాజిల్లా -- జిల్లా -2
పందొమ్మిది వందల నాలుగులో -- జిల్లా
బందరు కేంద్రముగా -- జిల్లా
కృష్ణానదీ పేరునా -- జిల్లా
కృష్ణాజిల్లా ఏర్పడెన్ -- జిల్లా ॥కృష్ణా॥

తూరుపున బంగాళం -- జిల్లా
పశ్చిమాన గుంటూరు -- జిల్లా
కొల్లేరు దక్షిణానా -- జిల్లా
ఖమ్మం ఉత్తరానా -- జిల్లా ॥కృష్ణా॥

చక్కెర ఫ్యాక్టరీలే -- జిల్లా
సక్కగున్న జిల్లా -- జిల్లా
చల్లపల్లి షుగర్సు -- జిల్లా
ఉయ్యూరు షుగర్సు -- జిల్లా ॥కృష్ణా॥

విశ్వనాథ గన్న జిల్లా -- జిల్లా
కాశీనాథు గన్న జిల్లా -- జిల్లా
ఘంటసాల గన్న జిల్లా -- జిల్లా
ఘంటశాల ఉన్న జిల్లా -- జిల్లా ॥కృష్ణా॥

కొండపల్లి ఖిల్లా -- జిల్లా
కొండపల్లి బొమ్మల్ -- జిల్లా
బందరు కలంకారీ -- జిల్లా
కూచిపూడి నాట్యం -- జిల్లా ॥కృష్ణా॥
విజయవాడ దుర్గా -- జిల్లా
ప్రకాశం బ్యారేజి -- జిల్లా
గాంధీ హిల్లుందండీ-- జిల్లా
నక్షత్రశాలుందీ -- జిల్లా ॥కృష్ణా॥

ఆకాశవాణి కేంద్రం-- జిల్లా
థర్మల్ విద్యుత్ కేంద్రం -- జిల్లా
పెద్ద రైల్వే కేంద్రం -- జిల్లా
గన్నవరం విమానశ్రయం -- జిల్లా ॥కృష్ణా॥

ఎన్‌టిఆర్‌ని గన్న జిల్లా --జిల్లా
ఏఎన్ఆర్‌ని గన్న జిల్లా -- జిల్లా
ఎస్వీఆర్‌ని గన్న జిల్లా -- జిల్లా
శోభన్‌బాబుని గన్న జిల్లా -- జిల్లా ॥కృష్ణా॥

పరిటాల వజ్రాలు -- జిల్లా
చందర్లపాడు గనులు -- జిల్లా
జగ్గయ్యపేటలోనా -- జిల్లా
ఇనుపగనులున్నాయి -- జిల్లా ॥కృష్ణా॥

హంసలాదీవి జిల్లా -- జిల్లా
పులిగడ్డ ఆక్విడక్టూ-- జిల్లా
మత్స్య సంపదందూ-- జిల్లా
పేరుగన్న జిల్లా -- జిల్లా ॥కృష్ణా॥

శ్రీకాకుళాంధ్ర దేవుడూ -- జిల్లా
చిలకలపూడి పాండురంగడూ -- జిల్లా
వేదాద్రి నరసింహం -- జిల్లా
వేల్పులున్న జిల్లా -- జిల్లా ॥కృష్ణా॥

జిల్లల్ల జిల్లగాదో జిల్లా - కృష్ణాజిల్లా
జిల్లా - కృష్ణాజిల్లా
జిల్లా - కృష్ణాజిల్లా
జిల్లా - కృష్ణాజిల్లా

# 20. జయహో భరతమాత

జయము జయము భరతమాత
జయము నీకు జగన్మాత
ఈజగాన సాటి ఎవ్వరే ఓయమ్మ నీకు
ఈజగాన సాటి ఎవ్వరే! ॥జయము॥

గంగ యమున గోదావరి సింధు కృష్ణ కావేరి
బ్రహ్మపుత్ర తుంగభద్ర తపతి నర్మద పెన్నా
పొంగి పొరలె తరంగాలు నీ మెడలో హారాలు
జీవ నదుల గన్నతల్లివే ఓయమ్మ నీవు
జీవ నదుల గన్నతల్లివే !

హిమవింధ్యపర్వతాలు దేవతలకు నిలయాలు
దట్టమైన అరణ్యాలు మహామునుల స్థావరాలు
పసిడిపంటల క్షేత్రాలు పంచలోహ ఖనిజాలు
పాడిపంటల కల్పవల్లివే ఓ యమ్మ నీవు
పాడిపంటల కల్పవల్లివే!

లోకమంత చీకటిలో తల్లడిల్లుతున్నప్పుడు
నాగరికతలేక నరులు పామరులైయున్నప్పుడు
వేదములను వెదికితెచ్చి జ్ఞాన భిక్ష పెట్టినావు
జగమునకు జ్ఞానజ్యోతివే ఓయమ్మ నీవు
జగమునకు జ్ఞానజ్యోతివే ॥జయము॥